



# 'స్థానిక' ఎన్నికల్లో లబ్ధి కోసమే గ్రామసభలు


పొత్తూరులో విలేకరులతో మాట్లాడుతున్న సిద్ధం వేణు

- ప్రజలను మళ్లీ మోసం చేసేందుకు కాంగ్రెస్ కొత్తనాటకాలు
- జడ్పీ మాజీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు ధ్వజం
- లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపట్టాలని డిమాండ్

ఇల్లంతకుంట రూరల్, జనవరి 23: 'గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయలేకనే కాంగ్రెస్ ప్రభుత్వం రోజుకో కొత్త నాటకానికి తెరలేపుతున్నది. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి పొందడం కోసం, ప్రజలను మళ్లీ మోసం చేసేందుకు ప్రజాపాలన పేరుతో పనికిరాని గ్రామసభలు నిర్వహిస్తున్నదని' జడ్పీ మాజీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు ధ్వజమెత్తారు. గురువారం పొత్తూరులో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామసభలు తూతూ మంత్రంగా నిర్వహిస్తున్నారని, అసలు ఒక్కో ఊరికి ఎన్ని ఇందిరమ్మ ఇండ్లు ఇస్తారో..? ఎంత మందికి ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు ఇస్తారో చెప్పలేని పరిస్థితిలో అధికారులు ఉన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేయాల్సి ఉండగా, కాంగ్రెస్ నాయకులు తమ వాళ్లకే సంక్షేమ పథకాలు అని బహిరంగంగానే చెపుతున్నారని దుయ్యబట్టారు. గ్రామసభలతో ప్రజలకు ఒరిగేదేమీ లేదని, ఓట్ల కోసమే నిర్వహిస్తున్నారని దుయ్యబట్టారు. గ్రామసభల్లో అధికారులను పక్కనబెట్టి కాంగ్రెస్ నాయకులే లబ్ధిదారుల పేర్లు చదవడం చూస్తేనే అర్థమవుతోందని మండిపడ్డారు. గ్రామసభల పేరుతో కాలయాపన కాదు, సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలపై దృష్టి పెట్టాలన్నారు. గ్రామాల్లో నిరుపేదలు ఎవరైతే ఉన్నారో వారిని గుర్తించి ఇందిరమ్మ ఇండ్లు, ఆత్మీయ భరోసా, కొత్త రేషన్‌కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం మహిళలకు ఇస్తామన్న రూ.2500 హామీ ఏమైందని, గ్రామసభల్లో ఆ విషయాన్ని ప్రస్తావించడం లేదన్నారు. పోలీసు పహారా మధ్య సభలు నిర్వహిస్తున్నారని, అన్యాయంపై లబ్ధిదారులు ప్రశ్నిస్తే బెదిరిస్తున్నారని, ప్రజాపాలన అంటే ఇదేనా..?, ఇందిరమ్మ రాజ్యం ఇదేనా..? అని ప్రశ్నించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సిద్ధం శ్రీనివాస్, పట్నం శ్రీనివాస్, గుంటి మధు, పట్నం మహేందర్, బండారి మహేశ్, ఆకుల రవి, పట్నం కరుణాకర్, గుంటి తిరుపతి, శ్రీధర్,తోడేటి సతీష్, పైడిపాల సంతోష్ ఉన్నారు.

# ఓటరు దినోత్సవానికి తరలిరావాలి


జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

కలెక్టరేట్, జనవరి 23: నథింగ్ లైక్ ఓటింగ్, ఐ ఓట్ ఫర్ ష్యూర్ అనే థీమ్‌తో 25న సమీకృత కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న జాతీయ ఓటరు దినోత్సవ వేడుకలకు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా కోరారు. ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం ఓటరు నమోదు పెంపు, ఎథికల్ ఓటింగ్‌పై అవగాహన కల్పించేందుకు ఏటా జనవరి 25న జాతీయ ఓటరు దినోత్సవంగా వేడుకలు నిర్వహిస్తామని, ఈ ఏడాది 'నథింగ్ లైక్ ఓటింగ్.. ఐ ఓట్ ఫర్ ష్యూర్' అనే థీమ్‌తో వేడుకలు జరుగుతున్నాయని చెప్పారు. జిల్లాలోని ప్రతి బూత్ స్థాయి అధికారి పోలింగ్ స్టేషన్ పరిధిలో నూతన ఓటర్లకు ఓటర్ కార్డుల పంపిణీ, వృద్ధ ఓటర్లకు సన్మానం వంటి కార్యక్రమాలను ఏర్పాటు చేస్తారని, ప్రతి గ్రామం, వార్డులలో ఓటర్ ప్లేడ్జ్ తీసుకోవడం జరుగుతుందన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశం మందిరంలో 25న ఉదయం 11 గంటలకు జరిగే వేడుకలకు హాజరై విజయవంతం చేయాలని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.




# మభ్య పెట్టేందుకే గ్రామ సభలు


ముస్తాబాద్‌లో మాట్లాడుతున్న నాయకులు


ముస్తాబాద్, జనవరి 23: కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేసే వీలులేక ప్రజల దృష్టిని మరల్చేందుకు, మభ్యపెట్టేందుకే గ్రామ సభలు నిర్వహిస్తున్నదని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బొంపెల్లి సురేందర్‌రావు, పట్టణ అధ్యక్షుడు ఎద్దండి నర్సింహారెడ్డి, సీనియర్ నాయకుడు రాచమడుగు సంతోష్‌రావు మండిపడ్డారు. మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం పాలన చేతకాక, ఇచ్చిన హామీలు అమలు చేసే దమ్ము లేక సర్వేలు, సభలు, సమావేశాల పేరుతో కాలయాపన చేస్తున్నదని ధ్వజమెత్తారు. రైతులకు రుణమాఫీ అంతంత మాత్రమే అమలు చేశారని, మహిళలకు ఇస్తానన్న నెలకు రూ.2,500, వృద్ధులకు రూ.4 వేల పింఛన్ ఏమైందని ప్రశ్నించారు. పథకాల లబ్ధిదారుల జాబితాలు ఇష్టారాజ్యంగా తయారు చేశారని ఆరోపించారు. ఎన్నో ఆశలతో గ్రామ సభలకు వచ్చిన నిరుపేదల పేర్లు లేక మనస్తాపం చెందుతూ వెనుదిరుగుతున్నారని, అధికారుల తీరును ఎండగడుతున్న ఘటనలు జరుగుతున్నాయని చెప్పారు. ఇక్కడ కేటీఆర్ సేన రాష్ట్ర అధ్యక్షుడు మెంగని మనోహర్, మాజీ సర్పంచ్ నల్ల నర్సయ్య, గూడూరి భరత్, శ్రీనివాస్, సుధాకర్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ కాలేజీలో తనిఖీ

చందుర్తి,జనవరి 22: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో గురువారం జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి వై శ్రీనివాస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో ప్రత్యేక సమావేశమయ్యారు. వచ్చే మార్చిలో నిర్వహించే పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. అధ్యాపకులు కళాశాలలో 90 రోజుల ప్రణాళికలు అమలు చేసి వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ఇక్కడ ప్రిన్సిపాల్ కాస దేవరాజం ఉన్నారు.

# 'రాజన్న' ఆలయ ఉద్యోగులపై వేటు

- ఆలయంలో సిబ్బంది తీరుపై సామాజిక మాధ్యమంలో భక్తుల పోస్టు
- కలెక్టర్ స్పందన
- 18 మందికి స్థానచలనం


ఎక్స్ వేదికగా ఓ భక్తుడు పెట్టిన పోస్టు

వేములవాడ, జనవరి 23: రాజన్న దర్శనానికి వచ్చిన భక్తులు ఆలయంలో తాము పడ్డ ఇబ్బందులను సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయగా, స్పందించిన ఉన్నతాధికారులు 18 ఉద్యోగులపై వేటు వేసిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. వివరాల్లోకి వెళితే.. ఇటీవల ఆలయంలో అసౌకర్యాలు, ఉద్యోగులు వ్యవహరిస్తున్న తీరుపై ఓ భక్తుడు సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయగా, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా స్పందించారు. వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించగా, మూడు రోజుల క్రితం 18 మంది ఉద్యోగులపై అంతర్గత బదిలీ వేటు వేశారు. ఇందులో భాగంగా ఏడుగురు జూనియర్ అసిస్టెంట్లు, ఐదుగురు రికార్డ్ అసిస్టెంట్లు, ఆరుగురు నాలుగో తరగతి ఉద్యోగులను అంతర్గతంగా బదిలీ చేస్తూ ఈవో వినోద్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, భక్తుల పట్ల ఉద్యోగులు ప్రవర్తిస్తున్న తీరుపై ఈవో వినోద్‌రెడ్డి గురువారం కౌన్సెలింగ్ నిర్వహించారు. భక్తులతో మర్యాదగా నడుచుకోవాలని సూచించారు.

## 25న కలెక్టరేట్‌లో జాబ్ మేళా

కలెక్టరేట్, జనవరి 23: జిల్లాలోని నిరుద్యోగ యువతకు ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగాలు కల్పించేందుకు 25న కలెక్టరేట్‌లోని ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో మినీ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా ఉపాధి కల్పనాధికారి నీల రాఘవేందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ అర్హతతో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని, నెలకు రూ.10 వేలు నుంచి రూ.20 వేల వరకు వేతనం ఉంటుందన్నారు. సిరిసిల్ల ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజీ ఆధ్వర్యంలో ఉదయం 11 గంటలకు జరిగే మేళాకు అర్హత, ఆసక్తి కలిగిన యువత తమ బయోడేటా, స్టడీ సర్టిఫికెట్లతో హాజరుకావాలని జిల్లా ఉపాధి కల్పనాధికారి రాఘవేందర్ కోరారు. మరిన్ని వివరాలకు 9700302582, 9885346768 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

